క్లుప్తంగా

సజ్జలను కలిసిన చేజర్ల



సజ్జల రామకృష్ణారెడ్డితో సుబ్బారెడ్డి

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబ్బారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఉదయగిరిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం.

సీతారాములకు హనుమంత సేవ



హనుమంత వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతారామ లక్ష్మణుల ఉత్సవ మూర్తులకు హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు.

ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలి

ఉదయగిరి: ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ పరిధిలో వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో జరిగే ఇంటర్వ్యూకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సీడీపీఓ పచ్చవ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నుంచి దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 18న ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం, దుత్తలూరు మండలం అభ్యర్థులు ఈ నెల 19న కావలి ఆర్డీఓ కార్యాలయం, వరికుంటపాడు మండల అభ్యర్థులు ఈనెల 20న కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

దుత్తలూరు: రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని దుత్తలూరు బిట్-2, నర్రవాడ, కొత్తపేట సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రతి రికార్డు నిర్వహణ సరిగా చేపట్టాలన్నారు. అధికారులు వచ్చినప్పుడు తగిన వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రసాద్, డీడీఓ నజీ ముల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలో కొంత మేర రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక బీసీకాలనీ వద్ద దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌ను మంగళవారం యుద్ధప్రాతిపదికన కమిషనర్ ఫణికుమార్ పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు. బుధవారం నుంచి యథాప్రకారం తాగునీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినోద్, సిబ్బంది రమణయ్య, యాసీన్, పెంచలయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన శీనయ్య, వెంకటరమణయ్య

సంగం: యూటర్న్ తీసుకుంటున్న ట్రాక్టర్‌ను వెనుకనే వస్తున్న బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సిద్దీపురం వద్ద నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. సిద్దీపురం గ్రామానికి చెందిన దేవ తన ట్రాక్టర్‌తో సిద్దీపురం వస్తున్నాడు. ఏఎస్‌పేట మండలం శ్రీకొలనుకు చెందిన యా కసిరి శీనయ్య, కామేపల్లి వెంకటరమణయ్య టీవీఎస్ ఎక్సెల్‌లో నెల్లూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరగడంతో వీరిద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. ఎస్సై నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌గా సైబర్ మోసాలు

సాంకేతిక టెక్నాలజీ.. సైబర్ మోసాలకు ఈజీగా మారింది. హైస్పీడ్ ఇంటర్నెట్ వ్యవస్థతో పాటు స్మార్ట్ ఫోన్లు అందుబాటులోకి రావడంతో బ్యాంకింగ్ నుంచి షాపింగ్‌ల వరకు ఆర్థిక కార్యకలాపాలన్నీ ఫోన్లలోని యాప్‌ల ద్వారానే జరుగుతున్నాయి. బ్యాంకింగ్ లావాదేవీలతో పాటు క్రెడిట్ కార్డులు సైతం యాప్‌లను ప్రోత్సహించడం, సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇదే సమయంలో పేపర్ లెస్ రుణ సదుపాయాలంటూ లోన్‌యాప్‌లు సోషల్ మీడియాల్లోకి, మెయిల్స్‌కు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. ఏవి నిజమైన లింక్‌లు, ఏవి మోసపూరిత లింక్‌లనే అవగాహన రాహిత్యం, కొందరి అత్యాశ, మరి కొందరి అవసరాలు ఆ మెసేజ్‌లకు ఆకర్షితులైన క్లిక్ చేసి కొల్లబోతున్నారు.

- కొంపముంచుతున్న సోషల్ మీడియా, ఓపెన్ సోర్స్ డేటా
- వీటి ఆధారంగా నమ్మించి మోసం చేస్తున్న నేరగాళ్లు
- స్మార్ట్ ఫోన్లు రావడంతో పల్లె వాసులను బురిడీ కొట్టిస్తున్న మోసగాళ్లు



కావలి: కావలి పట్టణంలో సైబర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో నగరాలు, పట్టణాలను ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేర ముఠాలు తాజాగా గ్రామీణులను, గృహిణులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఇంటర్నెట్ వ్యవస్థ, సోషల్ మీడియాలు, డిజిటల్ లావాదేవీలు కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ల వినియోగం విస్తృతమైంది. సైబర్ ముఠాలు వివిధ మార్గాల్లో ప్రజల డేటాను సేకరిస్తున్నాయి. గిఫ్టులు, లాటరీలు, ఆఫర్లు అంటూ వచ్చే మెసేజ్‌లకు విద్యావంతులు సైతం మోసపోతున్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాల పేరుతో ఏటీఎం, క్రెడిట్ కార్డుల బ్లాక్ అవుతాయంటూ ఖాతాదారుల వివరాలన్నీ నమ్మకంగా చెప్పడంతో ఓటీపీలు చెప్పించుకుని ఖాతాలు క్లోజ్ చేస్తున్నారు.

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ సంస్థల్లో నియామకాలు నిలిచిపోవడం, ఉద్యోగాల్లో భారీగా కోతలు విధిస్తుండడంతో పార్ట్‌టైం ఉద్యోగాలు, బ్యాక్‌డోర్‌లో నియామకాలు అంటూ యువతను కూడా సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. కావలి వంటి చిన్న పట్టణంలో ఏడాదిలో 200 పైచిలుకు కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. డేటా ఉల్లంఘనలు, రుణాలు అందించే సంస్థల నుంచి థర్డ్ పార్టీ సంస్థల సేకరిస్తున్న డేటా దుర్వినియోగం కావడంతో పాటు ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ టూల్స్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా సేకరించే డేటానే సైబర్ నేరస్తులు మోసాలు చేసేందుకు వినియోగిస్తుండడం గమనార్హం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు, యువత, గృహిణులు తెలిసీ తెలియక ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలు, ఇతర వివరాల ఆధారంగానే సైబర్ నేరస్తులు సులభంగా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీస్ వర్గాలు చెబుతున్నారు.

డేటా ఎలా సేకరిస్తారు అంటే?

సైబర్ నేరస్తులు చాలా మార్గాల్లో ప్రజల డేటా, ఫోన్ నంబర్లు సేకరిస్తారు. డేటా స్క్రాపింగ్ అనే టెక్నాలజీ ద్వారా డేటా బ్రోకర్లు అందించే డేటాతో పాటు ప్రైవేట్ సంస్థల్లో రుణాల కోసం అందించే దరఖాస్తులు, షాపింగ్ మాల్స్‌లో కూపన్లు, లక్కీ డ్రాల కోసం ఇచ్చే ఫోన్ నంబర్లు, సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, జాబ్ పోర్టల్స్‌లో యువత పెట్టే రెజ్యూమ్‌లు, యూట్యూబ్, ఫేస్‌బుక్‌ల్లో బిజినెస్ వీడియోల కింద కామెంట్ సెక్షన్‌లో యూజర్లు పోస్టు చేసే ఫోన్ నంబర్లను ప్రత్యేక పద్ధతుల్లో సైబర్ నేరస్తులు సేకరిస్తారు. వీటి ఆధారంగా యూజర్ ప్రొఫైల్స్ తయారు చేస్తారు. ఇందు కోసం సొంతంగా తయారు చేయించుకున్న సాఫ్ట్‌వేర్‌లు, మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ షీట్‌లు వినియోగిస్తున్నట్లు సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

ఫోన్ నంబర్ తెలిస్తే చాలు..

ఒక ఫోన్ నంబర్ తెలిస్తే చాలు ఆ వ్యక్తి సమస్త సమాచారాన్ని సైబర్ నేరస్తులు సులభంగా, పైసా ఖర్చు లేకుండానే ఓపెన్ సోర్స్ టూల్స్ ద్వారా తెలుసుకోగలరు. ఉదాహరణకు ఆ నంబర్ ఎవరి పేరుపై ఉంది, ఏ ఫోన్ ఉపయోగిస్తోంది, ఈ మెయిల్ ఐడీ ఏంటి, ఆర్థిక లావాదేవీల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ఏవీ ఉపయోగిస్తుంది? ఫేస్‌బుక్, టెలిగ్రాం, వాట్సప్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు సంబంధించి ఖాతాలు ఉన్నాయా లేదా? ఈ నంబర్ లేదా ఈ మెయిల్ ఐడీని ఇంటర్నెట్‌లో ఎక్కడైనా ఉపయోగించి ఉన్నారా అనే అన్నీ దారుల్లో సేకరిస్తారు. వీటి ఆధారంగా ఎంపిక చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. వీటి ఆధారంగా ఫోన్ చేసి జాబ్ ఆఫర్ ఉందనో, పార్ట్‌టైం ఉద్యోగం అనో, వ్యాపార అవకాశాలు, క్రిప్టో కరెన్సీ ద్వారా లక్షలు సంపాదించవచ్చనో ఎరవేస్తున్నారు. ఫోన్ చేసిన వాళ్ల పేరు, ఇతర వివరాలన్నీ నమ్మకంగా చెబుతుండడంతో అమాయకులు సులభంగా మోసపోతున్నారు.

స్వీయ జాగ్రత్తలతోనే రక్షణ

సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు చెబుతున్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం, స్వీయ జాగ్రత్తలు పాటించడం ద్వారానే సైబర్ మోసాలకు చెక్ పెట్టడం సాధ్యమవుతుంది. ఉదాహరణకు విద్యార్థులు ఉద్యోగాల కోసం వివిధ జాబ్ పోర్టల్స్‌లో బయోడేటాను అప్‌లోడ్ చేస్తుంటారు. వీటిని సేకరించిన సైబర్ నేరస్తులు ఉద్యోగావకాశాల పేరుతో ఆన్‌లైన్‌లోనే ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి సెక్యూరిటీ డిపాజిట్లు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో అందినకాడికి దండుకుంటున్నారు. ఏ సాఫ్ట్‌వేర్ సంస్థ కూడా ఉద్యోగం ఇచ్చే ముందు డబ్బులు డిపాజిట్ చేయించుకోవడం, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం నగదు డిమాండ్ చేయడం జరగదు. ఎవరైనా ఫలానా కంపెనీ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి, డిపాజిట్లు అడిగితే అది వంద శాతం మోసమని గుర్తించాలి. స్వయం ఉపాధి అవకాశాలకు సంబంధించిన వీడియోలు, గ్రూపుల్లో కొత్తగా చేరే వ్యక్తులను గుర్తించి వారిని సులభంగా ట్రాప్ చేస్తుంటారు. ఫ్రాంచైజీలు, వర్క్‌ఫ్రం హోం, డేటా ఎంట్రీ వర్క్స్, వీడియోలకు లైక్‌లు కొట్టడం వంటి అవకాశాల పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు. ప్లేస్టోర్ నుంచి తప్ప బయట నుంచి వచ్చే ఎటువంటి యాప్స్‌లింక్‌లను ఇన్‌స్టాల్ చేసుకోకపోవడం, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లో కూడా బయట వాళ్లతో షేర్ చేసుకోకపోవడం, అనుమానం వస్తే పోలీసులను సంప్రదించడం వంటి జాగ్రత్తలతోనే మోసాల నుంచి బయటపడవచ్చు.

దివ్యాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో ఏర్పాటు చేస్తున్న దివ్యాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు బాధితులకు అవగాహన కల్పించాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు తమ వద్దనున్న వైకల్య ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 10 గంటల శిబిరానికి హాజరుకావాలన్నారు.

22న దివ్యాంగుల ఉపకరణాలకు శిబిరం

ఉదయగిరి: ఈ నెల 22న ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగే దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఉదయగిరి నియోజకవర్గ దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సహకారంతో జరిగే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు దివ్యాంగుల క్యాంప్

కావలి: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కావలి ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులకు స్పెషల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ వాహనాలు, ట్రైసైకిల్స్, వినికిడి మంత్రాలు, చేతి కర్రలు వంటివి అర్హతను బట్టి ఇస్తారని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఫొటోలు-3 తమ వెంట తీసుకురావాలని తెలిపారు.

బండగానిపల్లి ఘాట్‌రోడ్డు పనులు వేగవంతం

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



అధికారులతో కలిసి రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

ఉదయగిరి: అటవీశాఖ అనుమతులు లేక అర్థాంతరంగా నిలిచిపోయిన ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డును జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మంగళవారం పరిశీలించారు. అటవీ, రెవెన్యూ, రోడ్డు భవనాలశాఖ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించి రెవెన్యూ, అటవీ రికార్డులు తనిఖీ చేశారు. బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, మనుబోలు మండలం వడ్లపూడి గ్రామ రోడ్ల నిర్మాణానికి మండలంలోని కొండాయపాళెం రెవెన్యూ నేలటూరు సమీపంలో అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా కేటాయించిన 1261, 1262 సర్వే నంబర్లలోని 11.50 ఎకరాల భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసి అటవీశాఖకు భూమిని బదలాయించి త్వరితగతిన రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ సంపదను కాపాడుకోవాలని కోరుతూ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి, తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ పి.శ్రీనివాసులు, ఏఈ నరేష్, సర్వేయరు రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలె సుబ్బారెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, వీఆర్వో వెంకట్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి భేటీ



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి వివిధ సమస్యల పరిష్కారంపై చర్చించారు. కావలి ప్రాంతంలోని రైతులకు సాగునీటి విడుదల, కావలిలో రెండో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయింపు, హౌసింగ్ పట్టాలు ఇచ్చి పొజిషన్ చూపించని వారికి వెంటనే పొజిషన్ చూపించడం, తుమ్మలపెంట రోడ్ పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకునే విషయమై కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి కనకదుర్గాదేవి ఉత్సవాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో గురువారం నుంచి ఐదు రోజుల పాటు కనకదుర్గాదేవి 16వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రాత్రి 8 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి సమకూర్చిన ఉత్సవ విగ్రహాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఉదయగిరి: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించి దాఖలు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను https// aprs. apcfss. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని గండిపాళెం గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు గల్లా మురళీకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు పోస్టు ద్వారా హాల్‌టికెట్లు పంపించడం లేదన్నారు. 5, 6, 7, 8 తరగతులకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్ష హాల్లోకి హాల్‌టికెట్, ప్యాడ్, బాల్‌పెన్‌తో రావాలన్నారు. గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

20న గురుకుల ప్రవేశాలకు పరీక్ష

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు పరీక్ష 20వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఆత్మకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వెబ్‌సైట్ ద్వారా తమ పుట్టిన తేదీ ద్వారా వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు గ్రామ చెరువుకట్ట సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.10,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- డ్వామా పీడీ నిర్మాలాదేవి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ నిర్మలాదేవి

వరికుంటపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ నిర్మలాదేవి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తూ లోపాలుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. చేసిన పనులకు రికార్డులే కీలకమన్నారు. సిబ్బంది బాధ్యతగా పని చేసి కేటాయించిన లక్ష్యాలు నూరు శాతం సాధించాలన్నారు. మండలంలో కూలీల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. టీఏలు కూలీల వద్ద నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ పద్ధతి మానుకోవాలని లేకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం ఆమె మండలంలోని గువ్వాడి, తూర్పుబోయమడుగుల, తూర్పుచెన్నంపల్లి తదితర గ్రామాలకు చేరుకుని క్షేత్ర స్థాయిలో కూలీలను విచారించారు. ఆమె వెంట ఏపీఓ శ్రీనివాసులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సంగం: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ డీఆర్ఓ పిచ్చిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద అటవీశాఖ అధికారులు మంగళవారం లైఫ్ స్టైల్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ గోపి, సచివాలయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. సేవ్ ఎనర్జీ, పర్యావరణాన్ని రక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రతిజ్ఞ చేసి పర్యావరణ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ డీఆర్ఓ సౌజన్య, ఎఫ్‌బీఓలు దొరసానమ్మ, ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఆపస్ సంఘం నాయకుడు

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండలంలోని 500 పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈఓ జానకీరాం, ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఆపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ తమ సంఘం ఉపాధ్యాయుల సమస్యలే కాకుండా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపస్ సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దశయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బందికి గ్లూకోజ్ ప్యాకెట్ల పంపిణీ



గ్లూకోజ్ ప్యాకెట్లను అందిస్తున్న డీఎం శ్రీనివాసులు

కావలి: ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు డ్రైవర్లను, కండక్టర్లకు సూచించారు. మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, వేసవితాపానికి శక్తిని కోల్పోకుండా ఉండేందుకు గ్లూకోజ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ వారమంతా బస్సు సిబ్బందికి డ్యూటీకీ బయలుదేరే సమయంలో ఓఆర్ఎస్ లేదా గ్లూకోజ్ ప్యాకెట్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థ నాయకుడు వస్తాడు

- మెట్టుకూరు ధనుంజయరెడ్డి



మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

వరికుంటపాడు: నియోజకవర్గానికి మంచి సమర్థత కలిగిన, ప్రజాసమస్యలు పరిష్కరించగలిగే వ్యక్తి ఇన్‌చార్జిగా వస్తాడని ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం వరికుంటపాడులో వైఎస్సార్‌సీపీ కన్వీనరు ఆంధ్రా బాలగురవారెడ్డి అతిథి గృహంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ విజయానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుంటూ ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మండలంలో పలు సమస్యలు ఉన్నాయని కన్వీనరు బాలగురవారెడ్డి, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర ఆయన్ను శాలువాతో సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ బోగినేని శ్రీనివాసులునాయుడు, మాజీ మండల కన్వీనరు గుంటుపల్లి నాగభూషణం, మెట్టుకూరు అమరజీవిరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నాయకులు మస్తానయ్య, చెన్నారాయుడు, బి.రాజేంద్ర, పి.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



మారంరెడ్డిపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి ఆర్బీకే పరిధిలో బోడసిద్ధాయపల్లిలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ ఆధ్వర్యంలో దెబ్బతిన్న పత్తి పంటను మంగళవారం పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వల్ల పంట దెబ్బతినిందని, పొటాషియం ఎరువులు రైతులు వాడడం లేదని, దీంతో పంటలు తెగుళ్ల బారిన పడతాయన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంటను కాపాడుకోవాలని సూచనలందించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, డీఆర్సీ ఏఓ శ్రీనివాసచక్రవర్తి, వీఏఏలు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులతో విజ్ఞానం



బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్

చేజర్ల(సోమశిల): విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనంతసాగరం మండల తహసీల్దార్ ఏవీ రమణరావు అన్నారు. మంగళవారం అనంతసాగరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. విద్యార్థులు వేమన, సుమతి శతకాల పద్యాలను వినిపించగా తహసీల్దార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు, వీఆర్వో నాగేంద్ర, మోహనకృష్ణ పెంచలసాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మాల్యాద్రిరెడ్డి

కలిగిరి: 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి మంగళవారం బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన 20 మంది విద్యార్థులకు తన సోదరుడు కొండారెడ్డి సహకారంతో బహుమతులు అందిస్తున్నామన్నారు. ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, స్థానిక నాయకులు మూలి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ఉదయగిరి: మండలంలోని గ్రామ సచివాయాల సిబ్బంది బాధ్యతగా పనిచేస్తూ సచివాలయాల సేవలను విస్తృత పరచాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని తిరుమలాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 శాతం పైబడి బయోమెట్రిక్ హాజరు ఉండాలన్నారు. స్పందన కార్యక్రమం నిర్వహించి వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు.

విధి నిర్వహణలో నిబద్ధత పాటించాలి

ఆత్మకూరురూరల్: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు విధి నిర్వహణలో నిబద్ధత పాటించాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బట్టేపాడు సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బొటిక నరసింహులు, పద్మజ, సంక్షేమ, ఇంజినీరింగ్ సహాయకులు నవీన, ఖాజామస్తాన్ పాల్గొన్నారు.